యూనిట్ I

# 2. కొయ్యగుర్రం

## ఆలోచించండి - మాట్లాడండి



ప్రశ్నలు:


1. పై చిత్రంలో ఏమి కనిపిస్తుంది?
2. ఆకాశంలో ఎగిరే రెక్కల గుఱ్ఱం గురించి మీకు తెలుసా?
3. ఇలాంటి రెక్కల గుఱ్ఱాలతో మీరైతే ఏం చేస్తారు?

**ఉద్దేశం:** కథలంటే పిల్లలకిష్టం. ప్రాచుర్యంపొందిన జానపదకథను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం. (ప్రస్తుత పాఠ్యభాగం 'బాలశ్రీ' గారు సంకలనం చేసిన "మనజానపదకథలు" అనే పుస్తకంలోనిది.)

**విద్యార్థులకు సూచనలు:**

1. కథను చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.





పూర్వం వత్సలదేశాన్ని కార్తికేయ మహారాజు పరిపాలించేవాడు. ఆయనకు ధర్మాత్ముడని, గొప్పవీరుడని పేరుంది. కార్తికేయ ప్రభువుకు ఒక్కగానొక్క కొడుకు యువరాజు జయసింహుడు. యువరాజు తండ్రిని మించిన తనయుడు. గొప్పవీరుడు, సాహసవంతుడు. చదువుసంధ్యలలో మేటి. దానధర్మాల్లోనూ ఆయనకు సాటి ఎవరూలేరు. వీర విద్యల్లో ఇంతవరకు అతన్ని ఎవ్వరూ ఓడించలేకపోయారు.

వత్సల రాజధాని రత్నపురికి దూరంగా రామాపురం అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కోటయ్య అనే వడ్రంగి నివసిస్తున్నాడు. ఆయన గృహోపయోగ వస్తువులు, వ్యవసాయ పనిముట్లు, కొయ్యతో విచిత్రమైన అనేక వస్తువులు తయారుచేయటంలో దిట్ట. ఆయన తయారుచేసిన వస్తువులను ధనవంతులకు విక్రయించేవాడు.

ఒకసారి కోటయ్య తన ప్రతిభను ధారబోసి ఒక కొయ్యగుర్రాన్ని తయారుచేశాడు. అచ్చం నిజమైన గుర్రంలా ఉన్న ఆ కొయ్యగుర్రం విశేషమేమంటే - దానిమీద కూర్చొని, ఆకాశంలో విహరించి రావచ్చు. దాని ప్రత్యేకత నలుగురికీ తెలియకూడదని రాత్రివేళ ఆ గుర్రం మీద ఆకాశంలో సంచరించి అనేకసార్లు పరీక్షించాడు. అయితే ఆ గుర్రం తనలాంటి వాడికి ఎందుకూ ఉపయోగపడదు. కాని ప్రభువులకైతే వన్నెతెస్తుంది; అవసరాలకు ఉపయోగపడుతుందని భావించాడు. కోటయ్య తన కొయ్యగుర్రాన్ని కార్తికేయ మహారాజుకు బహూకరిస్తే తగిన విధంగా ఆరాజు తనను సత్కరిస్తాడని, తనకూ కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని అనుకున్నాడు. అలా ఊహించిందే తడవుగా తన భార్యబిడ్డలకు విషయం చెప్పి, వారిని జాగ్రత్తగా ఉండమని పది రోజుల్లో తిరిగి వచ్చేస్తానని ఆ రాత్రే తన కొయ్యగుర్రం మీద ఆకాశమార్గంలో ప్రయాణించాడు.

తెలతెలవారుతుండగా రత్నపురి చేరుకున్నాడు. ఉదయం తన కొయ్యగుర్రాన్ని రాజదర్బారుకు తీసుకెళ్లాడు. కార్తికేయ మహారాజు దర్శనం చేసుకుని, తను తెచ్చిన కొయ్యగుర్రాన్ని కానుకగా ఇచ్చుకున్నాడు. దాని విశిష్టతను తెలియచెప్పాడు.



© SCERT not to be republished

అంతేగాక తానే ఆ గుర్రాన్ని ఎక్కి, గాల్లో పయనించి కిందకు దించాడు. సభ్యులందరూ కరతాళధ్వనులు చేసారు. కాని ఆ కొయ్య గుర్రంపై విహరించటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. అప్పుడు యువరాజు జయసింహుడు ముందుకొచ్చాడు.

జయసింహుడు కోటయ్య చెప్పిన విధంగానే గుర్రం ఎక్కి మీట తిప్పాడు. గుర్రం గాల్లోకి లేచి, రివ్వున ఆకాశంలోకి దూసుకుపోయింది. అలా వెళ్ళిన యువరాజు తిరిగి రాలేదు. సాయంకాలం వరకూ అందరూ ఉత్కంఠభరితంగా యువరాజుకోసం ఎదురుచూశారు. అయినా యువరాజు జాడలేదు. కోటయ్య భయపడిపోయాడు. కార్తికేయుడు కొడుకు జాడ దొరికే వరకు కోటయ్యను చెరలో వేయించాడు. తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచింది. రాజు సన్మానాన్ని ఆశించి వస్తే కారాగారవాసం దక్కింది. భార్యపిల్లలు ఎలా ఉన్నారోనని కోటయ్య కుమిలిపోసాగాడు.



అక్కడ...


జయసింహుడు ఆకాశమార్గంలో కొయ్య గుర్రం మీద శరవేగంతో పయనిస్తున్నాడు. తన నగరానికి తూర్పుగా కొండలు, కోనలు, అడవులు, నగరాలు దాటుకుంటూ చాలాదూరం వచ్చేశాడు. ఆయన గాలిలో ఎగురుతున్న ఆనందంలో కోటయ్య చేసిన సూచనలు మర్చిపోయాడు. దాంతో జయసింహునికి ఆ కొయ్యగుర్రాన్ని అదుపుచేసి, వెనక్కి మళ్ళించటం ఎలాగో తెలియలేదు. అయినా భయపడకుండా ఎన్నో విధాలుగా ప్రయత్నించాక, చివరకు చీకటిపడే వేళకు దాని కిటుకులు తెలుసుకుని అదుపులోకి తెచ్చుకోగలిగాడు. అది పున్నమిరాత్రి. వెన్నెల్లో గగనతలం అద్భుతంగా ఉంది. కాని ఉదయం నుంచి ఎడతెగని ప్రయాణం; ఆపై అన్నపానీయాలు తీసుకోకపోవడంతో జయసింహునికి ఆకలిగా, నీరసంగా ఉంది. ఎక్కడైనా ఆగాలని తన కొయ్యగుర్రాన్ని తక్కువ ఎత్తులో పోనిస్తూ కింద గమనించసాగాడు.

రాత్రి రెండోజాము గడిచేసరికి కొయ్యగుర్రం ఒక నగరాన్ని సమీపించింది. నగరం మధ్యలో పెద్ద కొండ మీద కోట కనిపించింది. అంతఃపురం మీద దోమతెరల్లో ఎవరో నిద్రపోతున్నారు. కొయ్యగుర్రాన్ని భటులెవరూ గమనించకుండా అంతఃపురంమీద నిలిపి కిందకు దిగాడు. అక్కడ పట్టుపానుపును చుట్టి దోమతెరలున్నాయి. చుట్టూ అనేక మంది దాసీలు నిద్రిస్తున్నారు. దోమ తెరల్లో ఒక అద్భుత సౌందర్యరాశి గాఢ నిద్రలో ఉంది. ఆమె ఏదేశపు రాకుమారో తెలియదు. అక్కడ పళ్ళెంలో ఉన్న ఆహారపదార్థాలు, పళ్ళు ఆరగించి ఆకలి తీర్చుకున్నాడు. కొయ్యగుర్రం ఎక్కి సమీపారణ్యంలోకి పోయి ఒక మండపంలో ఆ రాత్రి నిద్రపోయాడు.



మరునాడు అటుగా వచ్చిన వారిని జయసింహుడు విచారించగా, అది మాళవ రాజ్యమని, తను చూసిన సౌందర్యవతి మాళవ యువరాణి మణిమేఖల అని తెలిసింది. మరునాడు కూడ అంతఃపురంలో పళ్ళెంలోని తినుబండారాలు ఎవరో తినిపోయినట్లు గమనించింది మణిమేఖల. ఈ పని చేస్తున్నదెవరో తెలుసుకోడానికి మూడో రాత్రి పట్టుదలగా నిద్ర అభినయిస్తూ మెలకువగా ఉంది. ఆ విషయం తెలియని జయసింహుడు ఎప్పటిలాగే వచ్చి యువరాణి మణిమేఖల చేతికి దొరికిపోయాడు. మణిమేఖల "ఎవరు నీవు? గంధర్వుడివా? యక్షుడివా?" అని అడిగింది. "నా పేరు జయసింహుడు, మీ పక్క రాజ్యమైన వత్సలరాజ్యం యువరాజుని" అన్నాడు. మణిమేఖల "ఇంత మంది కాపలవారుండగా, ఎలా వచ్చావు?" అని అడిగింది. "నా కొయ్యగుర్రమెక్కి ఆకాశ మార్గాన వచ్చానని" అన్నాడు జయసింహుడు.

"మా నాన్నగారు పోగానే మేనమామ నన్ను వివాహమాడి, ఈ రాజ్యానికి రాజు కావాలని చూస్తున్నాడు. నాకది ఇష్టంలేదు! వాడొక దుర్మార్గుడు. మరి నన్ను నీవెంట తీసుకుపోగలవా?" అని మణిమేఖల అడిగింది. "అయితే ఇప్పుడే నిన్ను రాజ్యానికి తీసుకుపోతాను. నిన్ను రాణిగా చేసుకుంటాను. సరేనా!" అన్నాడు. ఆమె "అది నా అదృష్టంగా భావిస్తాను యువరాజా!" అన్నది. ఇద్దరూ కొయ్యగుర్రం మీద కూర్చొని, వత్సల దేశానికి బయలుదేరారు.



తెల్లవారేసరికి వారు తమ నగరానికి చేరుకున్నారు. ఆ సమయంలో నగరం వెలుపల వధ్య స్థలంలో అనేక మంది గుమిగూడి ఉన్నారు. ఎవరినో వధించబోతున్నారు. యువరాజు జాడ తెలియకపోవడంతో, దాన్ని కోటయ్య కుట్రగా భావించి ఆయనకు శిక్షను విధించారు. చివరిక్షణంలో జయసింహుడు వచ్చి శిక్షను ఆపించాడు.

రాజదంపతుల ఆనందానికి అంతులేదు. తమ కుమారుడు క్షేమంగా తిరిగిరావడమేకాదు,

అప్సరసలాంటి అందమైన కోడల్ని వెంట తీసుకొనివచ్చాడు. కోటయ్యను కాపాడి, నిర్దోషిని హతమార్చిన పాపం తమకు అంటకుండా కాపాడాడు. అంత కన్నా సంతోషం రాజదంపతులకేముంటుంది?

కోటకు వెళ్ళగానే తమసైన్యాన్ని సమాయత్తపరచి, పొరుగున ఉన్న మాళవరాజ్యం మీదికి దండెత్తాడు యువరాజు జయసింహుడు. యువరాణి మేనమామను యుద్ధంలో ఓడించి, మాళవరాజ్యాన్ని జయించాడు. ఆ వెనువెంటనే జయసింహుడికి, మణిమేఖలకు వైభవంగా వివాహం జరిగింది.

"ప్రభూ నాకు సెలవిప్పిస్తే మా ఊరికి వెళ్లిపోతాను. నా భార్య పిల్లలు నాకోసం ఎదురుచూస్తుంటారు" అంటూ ప్రభువులను వేడుకున్నాడు కోటయ్య. "కోటయ్యా...! నువ్వు తెచ్చిన అద్భుత కానుకైన కొయ్యగుర్రం వచ్చిన వేళావిశేషం. మాళవ రాజ్యం మా వశమైంది. బంగారంలాంటి కోడలు లభించింది. ఇక నువ్వు ఎక్కడికీ వెళ్లవలసిన పనిలేదు. నీ భార్య బిడ్డలను ఇక్కడకే పిలిపిస్తాను. మీకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం. మా ఆస్థానంలోనే ఉండిపో" అన్నాడు కార్తికేయుడు.

కోటయ్య నమస్కరిస్తూ "ప్రభూ! క్షమించాలి. ప్రభువులకు అనుగ్రహం వచ్చినా, ఆగ్రహం వచ్చినా తట్టుకోలేం. ఒకవేళ యువరాజా వారు రావటం కాస్త ఆలస్యమై ఉంటే నా ప్రాణాలు పోయి ఉండేవి. నా భార్య బిడ్డలు అనాథలై పోయేవారు. మా రామాపురంలోనే మేం సుఖంగా బతగ్గలం – ప్రభూ!" అంటూ వేడుకున్నాడు.

అతని ఆవేదన అర్థం చేసుకున్న కార్తికేయుడు కోటయ్యకు కావలసినంత ధనం, ఎన్నో బహుమతులు యిచ్చి సగౌరవంగా రామాపురం పంపించాడు.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. మీరు చూసిన జానపద సినిమా గురించి చెప్పండి.
2. ఈ కథలో ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఏది? దాన్ని గురించి చెప్పండి.
3. కథలో మీకు నచ్చిన పాత్ర ఏది? ఎందుకు?
4. కథను సొంత మాటల్లో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. పాఠం చదవండి. కింది సూచనలకు అనుగుణంగా వాక్యాలను పాఠంలో వెతకండి. వాటి కింద గీతగీయండి.

అ) కోటయ్య గొప్పదనం.

ఆ) కోటయ్య తయారుచేసిన కొయ్య గుర్రం విశేషం.

ఇ) యువరాజు జయసింహుడు, యువరాణి మణిమేఖల మధ్య జరిగిన సంభాషణ.

ఈ) రాజానుగ్రహం, కోటయ్య వీడుకోలు.



2. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

మరునాడు కూడా అంతఃపురంలోని పళ్ళెంలోని తినుబండారాలు తినిపోయిన గుర్తులు గమనించింది మణిమేఖల. ఈ పని చేస్తున్న దెవరో తెలుసుకోడానికి మరోరాత్రి పట్టుదలగా నిద్ర అభినయిస్తూ మెలకువగా ఉంది. ఆ విషయం తెలియని జయసింహుడు ఎప్పటిలాగే వచ్చి యువరాణి మణిమేఖల చేతికి దొరికిపోయాడు. మణిమేఖల "ఎవరునీవు? గంధర్వుడివా? యక్షుడివా?" అని అడిగింది. "నా పేరు జయసింహుడు. మీ పక్క రాజ్యమైన వత్సలరాజ్యం యువరాజుని" అన్నాడు. మణిమేఖల "ఇంతమంది కాపలావారుండగా "ఎలావచ్చావు?" అని అడిగింది. "నా కొయ్య గుర్రమెక్కి ఆకాశమార్గాన వచ్చానని" అన్నాడు జయసింహుడు.



అ) పై పేరాలోని సంభాషణ ఎవరెవరి మధ్య జరిగింది?

ఆ) పై పేరాలో "అభినయిస్తూ" అనే పదానికి అర్థమేమిటి?

ఇ) జయసింహుడు ఏ రాజ్యానికి వచ్చాడు?

ఈ) పై పేరాలో ఎవరు ఎవరి చేతికి దొరికారు?

ఉ) పై పేరాకు తగిన శీర్షికను సూచించండి.

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) జయసింహుడు కొయ్య గుర్రమెక్కి వెళ్ళిపోయిన తర్వాత జరిగిన పరిణామాలేమిటి?

ఆ) జయసింహుడు ఆకాశ మార్గంలో పయనిస్తుండగా ఏం జరిగింది?

ఇ) జయసింహుడు నగరాన్ని చేరుకున్న తర్వాత ఏం జరిగింది?

ఈ) మాళవ రాజ్య అంతఃపురంలో మూడోరోజు ఏం జరిగింది?

### III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) వృత్తి పని వాళ్ళంటే ఎవరు? మీ ప్రాంతంలోని వృత్తుల గురించి రాయండి.

ఆ) మీకు తెలిసిన వృత్తినిపుణుడు తయారుచేసిన వస్తువును వర్ణించండి.

ఇ) మీరే జయసింహుని స్థానంలో ఉంటే ఎలా ప్రవర్తించేవారో రాయండి.

ఈ) ఈ కథకు ఇంకే పేరు పెట్టవచ్చు? ఎందుకు? కారణాలు రాయండి.

2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) కథలో కోటయ్య, జయసింహుడు ఇద్దరూ కొయ్యగుర్రమెక్కి ఆకాశమార్గంలో విహరించారుకదా! కొయ్యగుర్రం ఎక్కి మీరైతే ఏం చేస్తారో ఆలోచించి రాయండి.

ఆ) ఈ కథను సొంతమాటలలో రాయండి.



©SCERT not to be republished

### IV. పదజాలం



1. కింది ఆధారాలను చదవండి. వృత్తులను సూచించే పదాలు రాయండి.

ఉదా:– కలపను వినియోగించి గృహోపయోగ వస్తువులు తయారుచేయువారు వడ్రంగి.

అ) మట్టిని వినియోగించి, కుండలు తయారుచేసేవారు ____________

ఆ) కొలిమిలో లోహాలు కరిగించి వివిధ వస్తువులు తయారుచేసేవారు __________

ఇ) బంగారంతో నగలు తయారుచేసే వారు ____________

ఈ) నూలుకు వివిధ రంగులు వాడి బట్టలు తయారుచేసేవారు __________

ఉ) బట్టలు వినియోగించి దుస్తులు తయారుచేసేవారు ____________



2. కింది పదాలకు అర్థాలు రాయండి. వాటిని సొంతవాక్యాలలో ఉపయోగించండి.

అ) విశిష్టత = __________ ఆ) సభ్యులు = __________

ఇ) వధ్య స్థలం = __________ ఈ) కుట్ర = __________

ఉ) వైభవం = __________ ఊ) అనుగ్రహం = __________

3. కింది పదాలకు వ్యతిరేక పదాలను పాఠంలో గుర్తించండి. ఆ పదాలతో వాక్యాలు రాయండి.

అ) అవమానం × ____________________

ఆ) దురదృష్టం × ____________________

ఇ) దోషి × ____________________

ఈ) అధైర్యం × ____________________

### V. సృజనాత్మకత



కింది వాటిలో ఒక దాన్ని చేయండి.

అ) కొయ్యగుర్రం కథను చిన్న నాటికగా రాయండి. మీ తరగతిలో ప్రదర్శించండి.

ఆ) వడ్రంగి గురించి ఆత్మకథ రాయండి. ఏకపాత్రాభినయం చేయండి.

### VI. ప్రశంస



కింది వాటిలో ఒకదాన్ని చేయండి.

అ) మీ ప్రాంతంలో / గ్రామంలో వృత్తి కళాకారులు తయారుచేసిన వస్తువుల లాంటి వస్తువులు తరగతి ఉపాధ్యాయుల నేతృత్వంలో తయారుచేసి ఉపాధ్యాయ లేదా ప్రముఖ దినోత్సవాలలో పాఠశాలలో ప్రదర్శించండి?

ఆ) మీ ప్రాంతంలోని కొన్ని కళారూపాలను గురించి తెలుసుకొని నచ్చిన కళారూపం గురించి రాయండి.



### VII. భాషాంశాలు



1. చెప్పు కు ముల్లు గుచ్చుకుంది.
2. నదిలో నీళ్ళు ప్రవహిస్తున్నాయి.
3. వర్షం కురవడం వల్ల బడికి వెళ్ళడం ఆలస్యమయింది.

పై వాక్యాలలో గీతగీసిన అక్షరాలు, పదం లోపిస్తే మీకు అర్థమవుతోందా? ఆయా వాక్యాలకు కు, లో, వలన, కి అనేవి చాలా ముఖ్యమయినవి. ఇటువంటి వాటిని విభక్తిప్రత్యయాలని అంటారు. విభక్తి లేకుండా వాక్యార్థం సరిపోదు. అంటే "వాక్యాలు పూర్తి అర్థాన్ని ఇవ్వాలంటే విభక్తులు అవసరం."

తెలుగులో ఉన్న విభక్తులు ఎనిమిది. కింది పట్టికలో ఉన్నాయి. చదవండి.

| విభక్తులు | – | ప్రత్యయాలు |
|---|---|---|
| ప్రథమ | – | డు, ము, వు, లు |
| ద్వితీయ | – | నిన్, నున్, లన్, కూర్చి, గురించి |
| తృతీయ | – | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| చతుర్థీ | – | కొరకున్, కై, కోసం |
| పంచమీ | – | వలనన్, కంటెన్, పట్టి, వల్ల |
| షష్ఠి | – | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ |
| సప్తమీ | – | అందున్, నన్ |
| సంబోధన ప్రథమా విభక్తి | – | ఓ , ఓయి, ఓరి, ఓసి. |

పాఠం చదవండి. పాఠంలోని విభక్తులను గుర్తించండి. వాటి కింద గీత గీయండి.

## ప్రాజెక్టు పని

మీ ప్రాంతంలో / గ్రామంలో పెద్దలు చెప్పే జానపదకథలు సేకరించండి. ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | కొయ్యగుర్రం కథను సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |
| 2. | కథను ధారాళంగా చదివి సొంతమాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | కథలోని పదాలను సొంతమాటలలో ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 4. | 'కొయ్యగుర్రం' కథను సంభాషణలు రాసి నాటకీకరణ చేయగలను. | ఔను / కాదు |

*"స్తబ్దత, సోమరితనమే మరణం.*
*కార్యోత్సాహమే జీవితం."*